క్లుప్తంగా

ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో అడ్మిషన్ల గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఫ్యాషనల్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సులలో ప్రవేశ గడువు తేదీని పొడిగించినట్లు 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ తెలిపారు. మెరిట్ ఆధారిత ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ కోర్సులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫామ్‌లను సమర్పించడానికి జూలై 9వ తేదీ వరకు తేదీని పొడిగించడం జరిగిందన్నారు.ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్, డిప్లొమో, బీఎస్.సీ కోర్సులను సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్(ఎస్‌సీడీఎస్) సహకారంతో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద ఈ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు.దరఖాస్తులను www.manuu.edu.in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు.

శ్రీవేంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో ఫెస్ట్


ఫెస్ట్‌లో పాల్గొన్న సురభి వాణిదేవి

మాదాపూర్: మాదాపూర్‌లోని శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు బుధవారం ఫెస్ట్‌ను నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఆటల పోటీలు, రెట్రో, మ్యూజిక్ డే తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శ్రీ వేంకటేశ్వర కళాశాల ఎల్లప్పుడు నైతిక విలువలు, వినూత్న అలోచనలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అజిత, వి.రజిత, ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె ప్రసూన పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఐఐటీ–జేఈఈ, నీట్, సీఏంఏ, సీక్లాట్ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి తాత్కాలిక పద్ధతిలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్ అంజయ్య తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టులలో అర్హత కలిగిన వారికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న తర్వాత రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలకు తమ అర్హత పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరవ్వాలన్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ కోసం ఈనెల 27న గౌలిదొడ్డిలోని కళాశాలలో రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 040–23391598లో సంప్రదించాలన్నారు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మియాపూర్: ఉరి వేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ హాఫీజ్‌పేటలోని నందినినగర్ కాలనీ, లక్ష్మీ ప్రియ రెసిడెన్సీ ప్లాట్ నంబర్–204లో అమిత్ చావ్లా(30) తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్నాడు. మంగళవారం సాయంత్రం అమిత్ చావ్లా తన రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కాసేటి తర్వాత తల్లి తలుపులు కొట్టినా తెరవలేదు. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అమిత్ మృతి చెందినట్లు నిర్ధారించాడు. అమిత్, జాహ్నవి ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో ఇటీవల ఎంగేజ్మెంట్ జరిగింది. నవంబర్ 23న వివాహం చేసుకునేందుకు తేదీ ఖారారు చేశారు. వివాహ విషయంలో ఆందోళనం చెంది క్షణికావేశంలో తన కుమారుడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తల్లి హీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: రానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భక్తులకు అంతరాయం కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు అన్నారు. బుధవారం శంషీగూడ, అంబీర్ చెరువు వద్ద ఉన కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు టమాట రూ.30, పచ్చిమిర్చి 60 , బెండ 50, కాకర 60, దొండ 50, దోస 35, ఆలు 30, చామ 50, కీర 35, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 90, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 100, ఉల్లి.

విష ద్రవాలతో బెంబేలు!

- దుర్వాసన, దుర్గంధంతో ప్రజలకు అవస్థలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


హుడాకాలనీలో ఉన్న ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్ పాయింట్


గార్బేజ్ కలెక్షన్ పాయింట్ పక్కన ఉన్న మంజీరా పైప్‌లైన్

చందానగర్: చందానగర్ సర్కిల్–21 పరిధి హుడాకాలనీలోని ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్ పాయింట్ నిర్వహణతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వివిధ కాలనీ నుంచి చెత్త చెదారం తీసుకువచ్చి ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్‌లో ప్రెస్సింగ్ చేస్తారు. ఈ ప్రెస్సింగ్ చేయడంతో వచ్చిన వ్యర్థాలను కై త్లాపూర్‌కు తీసుకువెళ్తారు. అయితే ఈ ప్రెస్సింగ్ ప్రక్రియలో వచ్చే విష ద్రవాలు బయట ఉన్న ఖాళీ స్థలంలోకి వదిలేయడంతో దుర్గంధంగా మారుతుంది. దీంతో పలు కాలనీ ప్రజలు దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త చెదారం ప్రెస్సింగ్ వల్ల వచ్చే ద్రవాలు ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మురుగు కాలువలోకి వదిలేయాలి. కానీ కాలువలోకి కాకుండా ఖాళీ ప్రదేశంలో వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


బయటకు వదులుతున్న విష ద్రవాలు

ఘాటైన వసనతో ఇబ్బందులు..

ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్ పాయింట్ నుంచి వచ్చే విష ద్రవాలు భూమిలోకి కలవకుండా సంపును ఏర్పాటు చేయాలి.చెత్త చెదారం ప్రెస్సింగ్ చేసిన అనంతరం చెత్తను తరలిస్తున్నారు కానీ చెత్త నుంచి విష ద్రవాలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చెత్త నుంచి వస్తున్న మురుగు నీటితో పక్కనే ఉన్న మొక్కలు ఎండిపోతున్నాయి. ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్ పాయింట్ పక్కనే నగరానికి తాగునీరు వెళ్లే మంజీరా పైప్‌లైన్ ఉంది. దీని వల్ల ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త ప్రెస్సింగ్ పాయింట్‌ను దీప్తిశ్రీనగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. వివిధ కాలనీ నుంచి తీసుకువచ్చే చెత్త చెదారం వల్ల చుట్టు పక్కల వారికి దుర్వాసన వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే చెత్త కలెక్షన్ సెంటర్‌ను తరలించాలని వేడుకుంటున్నారు. శానిటేషన్ అధికారులు ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్ సెంటర్‌లో శుభ్రతపై ప్రతి రోజు తనిఖీ చేయాలి.

దుర్వాసనతో ఇబ్బందులు



హుడా కాలనీలో ఉన్న ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ కలెక్షన్ పాయింట్ వల్ల ఉపయోగకరం. కానీ వాటి నుంచి వస్తున్న విష ద్రవాలతో కాలనీ వాసులమంతా దుర్వాసన, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు పరిశుభ్రతపై నిఘా ఉంచాలి.

– క్రిష్ణయ్య, హుడాకాలనీ

మొక్కలు ఎండిపోతున్నాయి



చెత్త చెద్రారం ప్రెస్సింగ్ వల్ల వస్తున్న విష ద్రవాలతో మొక్కలు ఎండిపోతున్నాయి. అంతే కాకుండా చుట్టు పక్కల వారు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలకు దూరంగా కలెక్షన్ పాయింట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– జగన్ యాదవ్, హుడాకాలనీ

నైపుణ్యాలను నేర్పడమే లక్ష్యం



రాయదుర్గం: పాఠశాల స్థాయిలోనే చదువుతో పాటు నైపుణ్యాలను నేర్పడమే లక్ష్యమని శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య సూచించారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఒకేషనల్ విద్యలో భాగంగా హాస్పిటాలిటీ అండ్ టూరిజం, ఏఐ ల్యాబ్, లైబ్రేరీను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకేషనల్ కోర్సుల తరహా విద్యార్థులకు ఆయా రంగాలలో నైపుణ్యాలను నేర్పించడం ద్వారా పాఠశాల స్థాయిలో నైపుణ్యాలను తయారు చేయడానికి అవకాశం ఏర్పడడం ఆనందంగా ఉందన్నారు. పర్యాటక, అతిథ్యరంగాలు, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్ బాబు మాట్లాడుతూ.. ఒకేరోజు మూడు ప్రధాన వాటిని ప్రారంభించామన్నారు. అందులో ఒకేషనల్ కోర్సుల కోసం పర్యాటక, ఆతిథ్య రంగాల్లో ఏఐల్యాబ్‌తోపాటు ప్రత్యేకంగా లైబ్రరీని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ విద్యాకమిటీ చైర్మన్ కృష్ణగౌడ్, సభ్యులు కృష్ణయాదవ్, నరేందర్, ఉపాధ్యాయులు స్వర్ణలత, సుధీరా, టీవీమమత, దేవమణి, శ్రీనివాస్, సునీత, పావని, శాంత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: గోకరాజు రంగరాజు, ప్రశాంత్‌నగర్ ఫీడర్ విద్యుత్ మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఓల్టేజ్ హోం, వెంకటరాయనగర్, బాలాజీ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, ఇందిరమ్మ ఫేస్–1, 2, ఆర్‌ఎల్ సిటీ రోడ్డు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గోగరాజు రంగరాజు కళాశాల రోడ్డు, ఆర్‌ఎంసీటీ, విజ్ఞాన్ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలి పరిధిలో..

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గచ్చిబౌలి ఏఈ వెంకట్ నారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, విప్రో సర్కిల్, డోమినో ఏరియా, అలేఖ్య హోమ్స్. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కీస్టోన్ స్కూల్, జనచైతన్య తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్ : తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాయిబాబా టెంపుల్, సిటిజన్ కాలనీ, శివాజీనగర్, భారత్ పెట్రోల్ బంక్ వెనకాల గిడ్డంగి ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానుకుంట, కూరగాయాల మార్కెట్, ఎస్‌ఎం లేఅవుట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏడీఈ శివకృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

ఆరు ద్విచక్ర వాహనాల వేలం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో పట్టుపడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం చేయనున్నారు. డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ ఆదేశాల మేరకు జిల్లా మద్య నిషేధ అధికారి సమక్షంలో పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో గురువారం ఉ.11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత ధరవత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న శివాసింగ్

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని బీజేపీ గచ్చిబౌలి డివిజన్‌లో డివిజన్ నూతన కార్యవర్గం, అనుబంధ సంఘాల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. బుధవారం డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ, బీజేవైఎం, మహిళా, ఇతర మోర్చాలలో నియమించబడిని వారికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శివాసింగ్ మాట్లాడుతూ.. గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీని తిరుగులేని శక్తిగా తయారు చేయడంలో అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. పార్టీలో సీనియర్లు, జూనియర్లు, కార్యకర్తలతో కలిసి పనిచేసి ఏ ఎన్నికలు వచ్చినా విజయమే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. దేశంలో ఎమర్జెన్సీ కొనసాగించి 50 ఏళ్లు పూర్తి కావడంతో అందుకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీన్‌లాల్‌సింగ్, నరేందర్‌ముదిరాజ్, వరలక్ష్మీ, నర్సింహ్మారావు, రవీందర్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, కిషన్, శ్రీకాంత్‌రెడ్డి, అనంతరెడ్డి, బబ్లూసింగ్, భూపాల్, సంకేష్‌సింగ్ సామ్రాట్‌గౌడ్, అమర్ యాదవ్, హేమ, నళిని, రేవతి, కవితబాయి పాల్గొన్నారు.

ఆగస్టు 9,10 తేదీల్లో ఫెస్ట్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంగీత దర్శకుడు రమణగోగుల

రాయదుర్గం: ఏడేళ్ల విరామం తర్వాత ఆగస్టు ఫెస్ట్–2025 మళ్లీ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఆగస్టు 9,10 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ ఫెస్ట్‌లో 18 వేల మంది వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఆగస్టుఫెస్ట్–2025 కర్టన్‌రైజన్ కార్యక్రమాన్ని సంగీత దర్శకుడు రమణ గోగుల బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణగోగుల మాట్లాడుతూ.. ఆగస్టు ఫెస్ట్ అనేది అవకాశమైన క్షణమన్నారు, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టార్టప్ ప్రపంచాన్ని హైదరాబాద్‌కు తీసుకొస్తామని ఫెస్ట్ వ్యవస్థాపకుడు కిరణ్‌మావెరిక్ పేర్కొన్నారు. 2017లో ఈ ఆగస్టు ఫెస్టును నిలిపివేశామని, ఇప్పుడు మళ్లీ పునర్నిర్మాణం చేస్తున్నామన్నారు. గత ఒక సంవత్సరం నుంచి దానిపై పనిచేస్తున్నామని రూ.1.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. నగరంలో వెంచర్ క్యాపిటల్ పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని కూడా కోరుకుంటున్నామన్నారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స


అరుదైన గుండె శస్త్ర చికిత్స చేసిన కిమ్స్ డాక్టర్లు

గచ్చిబౌలి: పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉండి సుపీరియర్ వెనా కావా అనే సమస్యతో బాధపడుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్(29)కు కొండాపూర్ కిమ్స్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. కిమ్స్ చీఫ్ కన్సల్టెంట్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ విసర్గ మాట్లాడుతూ.. బాధితుడు నిత్యం బ్యాడ్మింటన్ ఆడేవాడని, విపరీతమైన అసలట రావడంతో వైద్యులను సంప్రదించగా అతడి సమస్య సంక్లిష్టం కావడంతో శస్త్ర చికిత్స చేసేందుకు ఎవరు ముందుకు రాలేదన్నారు. అతడికి పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉండటంతో సుపీరియర్ వెనా కావా రకం ఏఎస్‌డీతో బాధపడుతున్నట్లు గుర్తించామని తల, మెడ నుంచి చెడు రక్తాన్ని గుండెకు తీసుకెళ్లే రక్త నాళాల్లో సమస్య ఉందని, దీనికి తోడు గుండె పైభాగంలో రెండు గదుల మధ్య రంధ్రం ఉందన్నారు. ట్రాన్స్ యూసోఫేగియల్ ఈసీజీ, రైట్ హార్ట్ కాథెటరైజేషన్ లాంటి పరీక్షలు నిర్వహించి రెండు గంటల పాటు గుండెను ఆపి రోబోటిక్ పద్ధతిలో రంధ్రాన్ని మూసేందుకు శస్త్ర చికిత్స చేశామన్నారు. వారం రోజుల్లోనే పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశామని వివరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని పాపిరెడ్డికాలనీకి చెందిన సుధారాణికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుదన్నారు.

నేడు చందానగర్‌లో మంత్రి పర్యటన

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధి శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు గురువారం(నేడు) శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు రూ.45 కోట్లతో నూతనంగా రోడ్డు విస్తరించనున్నామన్నారు. చుట్టు పక్కల కాలనీ వాసులకు ఇబ్బందులు రాకుండా రోడ్డు పనులు చేపట్టాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.

కూల్చిన వాటిని మళ్లీ నిర్మిస్తే చర్యలు

పంచాయతీ కార్యదర్శి సుభాష్


నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామ పరిధిలో పీఎస్‌ఆర్ టౌన్ షిప్‌లో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులను మించి భవనం నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా వినకుండా పనులు చేస్తుండడంతో కూల్చివేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకు నిర్మాణం చేపట్టాలని సుభాష్ తెలిపారు.

జై గణేష్ భక్తి సమితి ఇన్‌చార్జిగా కోటిరెడ్డి

మోతీనగర్: జై గణేష్ భక్తి సమితి కూకట్‌పల్లి, సనత్‌నగర్ ఇన్‌చార్జిగా మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీకి చెందిన లయన్ అన్నెం కోటిరెడ్డిని నియమిస్తూ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు జైన్ కుమార్ చారి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు నెలలో జరిగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతిని పూజించి, నిమజ్జనం చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, ఖాజా నగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సంబంధించిన సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. సలీం, ఖాసీం, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు రవికుమార్, శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివ, కాలనీవాసులు పాల్గొన్నారు.

దొంగల ముఠా రిమాండ్

13 ద్విచక్రవాహనాల స్వాధీనం

మియాపూర్: బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను మియాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.ఉదయ్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ కుమార్, సీఐ క్రాంతి కుమార్, డీఐ రమేష్ నాయుడులతో కలిసి వివరాలు వెల్లడించారు. కొల్లూర్‌కు చెందిన ఎంకు శ్రీకాంత్(24), మియాపూర్ గోకుల్ ఫ్లాట్స్‌లో నివాసముంటున్న కుంభ వెంకటేశ్వర్లు అలియాస్ వెంకి(23), నల్లగొండ వేణు(20), ఏరువా గంగాధర్ శ్రీనివాస్ అఖిల్ రెడ్డి(23) నలుగులు స్నేహితులు. శ్రీకాంత్, వెంకటేశ్వర్లు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండగా నల్లగొండ వేణు లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఏరువా గంగాధర్ శ్రీనివాస్ అఖిల్ రెడ్డి బీటెక్ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. వీరంతా జల్సాలకు అలవాటు పడి పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. చోరీ చేసిన బైక్‌లను విడి భాగాలుగా చేసి ఆంధ్రప్రదేశ్, ఇతర ప్రాంతాల్లో అమ్మేవారు. మియాపూర్ ఆర్టీసీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 10న తన రాయల్ ఇన్ ఫీల్డ్ బైక్ చోరీ అయినట్లు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, నల్లగొండ వేణు, ఏరువా గంగాధర్ శ్రీనివాల్ అఖిల్ రెడ్డిను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు


చోరీ చేసిన వాహనాలు

టిప్పర్లలో తీసుకొచ్చి.. రోడ్డుపై పారబోసి

శేరిలింగంపల్లి: భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేయరాదని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా కొందరు బేఖాతరు చేస్తున్నారు. భవన యజమానులు, టిప్పర్ల డ్రైవర్లు ఇష్టానుసారంగా రోడ్లపైనే భవన నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు. శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పెద్ద రోడ్డులో రాత్రి వేళల్లో టిప్పర్లలో తీసుకొచ్చి భవన నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నా పట్టించుకునే నాథులే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాపిరెడ్డినగర్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపైనే పెద్ద ఎత్తున చెత్తను వేస్తుండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పాపిరెడ్డి నగర్‌కు వెళ్లే రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు


రహదారి పక్కనే వేసిన బండరాళ్లు